క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.పది వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు సికింద్రాబాద్‌కు చెందిన గోపరాజు శిరీష్–అలేఖ్య దంపతులు సోమవారం రూ.10,232 విరాళం అందించారు. దాత కుటుంబానికి అర్చకులు ప్రత్యేక దర్శనం కల్పించడంతో పాటు స్వామి వారి ఆశీస్సులు అందించారు. విరాళం అందించిన దాత కుటుంబానికి ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి రావులపాలేనికి చెందిన పెరవలి వెంకటేశ్వరరావు–వెంకటలక్ష్మి దంపతులు రూ.5,116 విరాళం అందించినట్లు ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ అందజేత



ఆలమూరులో విద్యార్థులకు ఐరన్ సిరప్ డ్రాప్స్ వేస్తున్న సిబ్బంది

ఆలమూరు: మండలంలోని 39 ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ చుక్కలు వేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనీమియా ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ అందజేశారు. ఎనీమియా నివారణకు విడతల వారీగా ఈ డ్రాప్స్ అందిచనున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

ఎంపీడీఓగా సత్యనారాయణ



అంబాజీపేట: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా కె.సత్యనారాయణ సోమవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ప్రతిపాడు మండల పరిషత్‌లో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఎంపీడీఓగా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.రత్నంరాజు బదిలీపై రామచంద్రపురం వెళ్లారు. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందేలా చూస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓను సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలోని మేరీ మాత వృద్ధాశ్రమంలో సోమవారం పలుసేవా కార్యక్రమాలు జరిగాయి. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ పుట్టినరోజు కార్యక్రమాన్ని ఆ పార్టీ నేతలు నిర్వహించారు. ఆశ్రమంలో పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే మలికిపురం కూడలిలో కేక్ కట్ చేసి పంచారు. ఆయా కార్యక్రమాల్లో పీసీసీ సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణ, దేశిరెడ్డి ఉదయ భాస్కరరావు, తోటె ప్రతాప్, వలవల విజయకుమార్, అడబాల వెంకటసుబ్బారావు, చెవ్వాకుల రాము, అల్లూరి మధురాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అయినవిల్లి: నిత్యం యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ఇంటర్నేషనల్ యోగా జడ్జి, యోగా గురువు మోటూరి భైరవస్వామి అన్నారు. మండలంలోని నల్లచెరువు శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో యోగా గురువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. మోటూరి భైరవస్వామి మాట్లాడుతూ ప్రాణాయామం, సూర్య నమస్కారాలు వంటి ఆసనాలతో జరిగే మేలును వివరించారు. యోగా సాధనతో శరీరంలో ప్రతి అవయవానికి రక్త సరఫరా సాధ్యమవుతుందన్నారు. యోగాతో నిత్యం యవ్వనంతో ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

30 మందికి ఉచిత వైద్యసేవలు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి–2 సచివాలయం కార్యాలయం వద్ద సోమవారం రోగులకు 104. ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను అందించారు. డీఈఓ లక్ష్మీప్రశాంతి, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్ఓ యుగశ్రీ 30 మంది రోగులను పరీక్షించి వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కొల్లు అమ్ములు, ఆశా వర్కర్లు ఉన్నారు.

వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం స్వామి అష్టోత్తర పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రొయ్యల ఎదురీత..

- ప్రతికూల వాతావరణంతో రైతుల సతమతం
- వైరస్‌ల దాడి తీవ్రం
- పెరిగిన పెట్టుబడి
- తేలిపోతున్న ట్యాంకులు



చింతలమోరిలో తక్కువ కౌంట్‌లో పట్టిన రొయ్యలు

మలికిపురం: అధిక వేడి వాతావరణంతో సంభవించిన మార్పులు ఆక్వా రైతులను నిలువునా ముంచుతున్నాయి. ప్రస్తుతం అధిక వేడి రొయ్యల చెరువుల పాలిట శాపంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో వైరస్‌లు ఆక్వా చెరువులపై ఎడాపెడా దాడి చేస్తున్నాయి. ఓ వైపు వైట్ గట్.. మరో వైపు విబ్రియో భీకరదాడితో ఆక్వా రైతు కుదేలవుతున్నాడు. గత నెల రోజులుగా ఎండల వల్ల ఆక్వా చెరువులతో వైరస్‌ల దాడి ముమ్మరంగా సాగుతుంది. ప్రస్తుత వేసవిలో దిగుబడి బాగుంటుందని రైతులు పెద్ద సంఖ్యలో గత మార్చి చివరి వారం, ఏప్రిల్ నెలల నుంచి రొయ్య సీడ్‌ను చెరువుల్లో వేశారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో వైట్ గట్ దాడి అధికమైంది. ఈ వైరస్ ధాటికి ఏకంగా 50 శాతం చెరువులు ఖాళీ అయ్యాయి. మరలా విబ్రియో వైరస్ దాడి ప్రారంభమైంది. మరో 25 శాతం రొయ్యల చెరువులు ఖాళీ అయ్యాయి. అవుతున్నాయి కూడా. ప్రధానంగా వైట్ గట్, విబ్రియో, ఎల్లో గట్ వైరస్‌ల దాడి అధికంగా ఉన్నట్లు రైతులు, ఆక్వా టెక్నీషియన్లు అంటున్నారు. ఎడాపెడా వైరస్ దాడితో రైతులు ఏం చేయాలో పాలు పోక కుదేలవుతున్నాయి.

వైట్‌గట్, విబ్రియో వైరస్‌ల దాడికి జీర్ణాశయం స్తంభించి మేత తినక రొయ్యల్లో ఎదుగుదల లేదు. ఎండలకు రొయ్యలు చెరువు ఒడ్డుకు చేరి ఎదురీదుతున్నాయి. సాయంత్రం చనిపోయి మట్టానికి పోతున్నాయి. అయిన కాడికి పట్టుకుందామని ఆశ పడిన రైతులు పట్టుబడి పట్టే లోపే వేలాది ఎకరాల్లో రొయ్యలు చనిపోతున్నాయి. మరోవైపు రొయ్య సీడ్, మేత, ఇతర మందులు, వాటర్ మేనేజ్ మెంట్, విద్యుత్, డీజిల్ ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఎకరానికి రూ.1.5 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులకు చెరువుల్లో అడుగునకు చేరిన చచ్చిన రొయ్య గుల్లలతో పాటు చచ్చుబారిన రొయ్యలు తూకంలో తేలిపోతున్నాయి. ప్రస్తుతం రొయ్యల సాగు జరుగుతున్న ప్రాంతాల్లో జరుగుతున్న రొయ్యల పట్టుబడుల్లో అధిక శాతం ఇలా వైరస్ బారిన పడినవే. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాలలో మొత్తం 20 వేల ఎకరాల్లో ఈ సారి రైతులు వనామీ సాగు చేశారు. వీటిలో దాదాపు 10 వేల ఎకరాల్లో రొయ్యలు పైన పేర్కొన్న వైరస్‌ల వల్ల చనిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ఎకరానికి రూ.లక్ష చొప్పున ఇప్పటి వరకూ రూ.10 నుంచి 15 కోట్ల మేర రైతులకు నష్టం వాటిల్లినట్టు అంచనా. రొయ్యలు వైరస్ బారిన పడడానికి ప్రధాన కారణం వేడి వాతావరణమేనని ఫిషరీష్ అధికారులు అంటున్నారు. వేడి వల్ల ప్రధానంగా ఆక్సిజన్ పడిపోతుంది. ఎండలకు నీటి సెలినిటీ పెరిగిపోతుంది. దీంతో మేత తినదు. పైగా చెరువులో విష పదార్థాలు పెరిగిపోతాయి.

సీడ్ ఎంపికలో లోపం..

ప్రధానంగా ఆక్వా సాగులో సీడ్ ఎంపికలో లోపం వల్లనే రొయ్యలు వైరస్‌ల బారిన పడుతున్ననట్లు ఫిషరీస్ అధికారులు అంటున్నారు. కొన్ని ఆక్వా హేచరీలు సీడ్ ఉత్పత్తిలో ఏటా కొత్త తల్లి రొయ్యలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని, అలా కాకుండా పాత తల్లి రొయ్యలనే వినియోగించి సీడ్ ఉత్పత్తి చేస్తుండడంతోనే వైరస్‌ల వ్యాప్తికి దారి తీస్తుందని వారు అంటున్నారు.

ఎండలతో రొయ్యలకు ఇబ్బంది



ప్రస్తుతం ఎండల తీవ్రత వల్ల వాతావరణంలో సమతుల్యత లోపించడం వల్ల ఆక్వా సాగుకు ప్రతి కూల పరిస్థితు ఏర్పడ్డాయి. ఖర్చు విపరీతంగా పెరిగి పోయింది. వైరస్ బారిన పడి ఎకరాకు రూ. లక్షన్నరకు పైగా నష్టం ఏర్పడింది.

– రుద్రరాజు చిన్నరాజా, ఆక్వా రైతు, గుడిమూల

రక్షణ చర్యలు తీసుకోండి



ఎండల వల్ల రొయ్యకు చాలా నష్టం ఏర్పడుతుంది. సెలనిటీ లెవెల్ పాటించాలి. ఆక్సిజన్ 4 పీపీఎం తగ్గకుండా చూసుకోవాలి. ఏరియేటర్స్ తిరగాలి. చెరువులో విష పదార్థాల నివారణకు వాటర్ ప్రొ బయోటిక్, గట్ నివారణకు ప్రొబయోటిక్ వాడాలి. ఆక్సిజన్ కొరత నివారణకు సూచించిన పౌడర్‌లను చెరువులో వేయాలి.

– సిద్ధార్థ వర్ధన్, ఏడీ ఫిషరీష్, రాజోలు

విద్యుత్ సమస్యలపై సీఎండీతో చర్చలు



ఏపీఈపీడీసీఎల్ సీఎండీతో చర్చలు జరుపుతున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు/మలికిపురం: నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌తో చర్చలు జరిపినట్టు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సోమవారం తెలిపారు. నియోజకవర్గంలో 16 విద్యుత్ కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 150 అవసరమున్నాయని అలాగే 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 20, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 20, 300 విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని సీఎండీకి విజ్ఞప్తి చేశామన్నారు. వేసవి దృష్ట్యా నియోజకవర్గంలో అనేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని సీఎండీకి వివరించామన్నారు. నియోజకవర్గంలో లోఓల్టేజీ సమస్యను పూర్తిగా నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శి సూరిశెట్టి బాబి, వైఎస్సార్ సీపీ నాయకులు కంచర్ల శేఖర్, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనలపై చెత్త తొలగింపు

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిలోని ఆలమూరు–రావులపాలెం కొత్త, పాత వంతెనలపై ఇరువైపుల పేరుకుపోయిన చెత్తను సిబ్బంది తొలగిస్తున్నారు. ఇటీవల వీచిన ఈదురుగాలుల ధాటికి ఇరువైపుల చెత్త పేరుకుపోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణించేటపుడు దుమ్ము, ధూళి కంట్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై స్పందించిన ఎన్‌హెచ్ఏఐ తమ కూలీలతో వంతెనల రక్షణ గోడల కింద ఉన్న చెత్తను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు.

ఎంఈఓ–2గా ప్రకాష్

అంబాజీపేట: మండల ఎంఈఓ–2గా మోకా ప్రకాష్ ఉద్యోగ బాధ్యతలను సోమవారం స్వీకరించారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌కు ఇటీవల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఎంఈఓగా పదోన్నతి లభించింది. హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎంగా బి.వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరిస్తారని ప్రకాష్ తెలిపారు. ఎంఈఓగా బాధ్యతలు తీసుకున్న ప్రకాష్‌ను ఉపాధ్యాయులు, సీఆర్పీలు అభినందనలు తెలిపారు.

పి.గన్నవరం ఎంఈఓ–2 గా వీరభద్రం

పి.గన్నవరం: బట్టేల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా చింతా వీరభద్రం పదోన్నతిపై పి.గన్నవరం ఎంఈవో–2 గా నియమితులయ్యారు. సోమవారం ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని పాఠశాలల అకడమిక్ వ్యవహారాలను ఆయన పర్యవేక్షిస్తారు. ఈసందర్భంగా ఎస్టీయూ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

కొత్తపేట ఎంఈఓ–2గా లీలావతి

కొత్తపేట: స్థానిక ఎంఈఓ–2గా కె.లీలావతి బాధ్యతలు చేపట్టారు. అల్లవరం మండలం గోడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న లీలావతిని కొత్తపేట ఎంఈవో–2గా పదోన్నతి పొందారు. ఆమె సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తదితరులు అభినందించారు.

వలంటీర్లు దేశానికే ఆదర్శం



అంబాజీపేటలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని అంబాజీపేట మార్కెట్ యార్డులో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ఎలాంటి సిఫారసులకు, అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి ముంగిటకే పథకాలను చేరవేసేందుకు సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంధానకర్తలన్నారు. మండలంలోని 13 సచివాలయాలకు సంబంధించి 237 మంది వలంటీర్లను సేవా రత్న, మిత్ర, వజ్ర అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, రాష్ట్ర నాయకులు పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షులు తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు, ముత్తాబత్తుల ప్రశాంత్, సర్పంచ్ కోట బేబిరాణి, సొసైటీ అధ్యక్షులు నందుల ఆదినారాయణ, బొంతు శ్రీనివాసరావు, నేతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబంలో సంతోషం



జి.అగ్రహారంలో లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రభుత్వం నవరత్న పథకాలను చిత్తశుద్ధితో పారదర్శకంగా అమలు చేయడంతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గడపగడపకూ ప్రజలు ఘనంగా స్వాగతం పలుకుతున్నారన్నారు. ఈ పథకాలు కొనసాగితే చాలని మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రావాలని కోరుకుంటున్నామని వారు ఆనందంగా చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశం ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనేది తెలుసుకునేందుకే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులకు నాలుగేళ్లలో పొందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, ఎంఎం శెట్టి, రాయుడు షణ్ముఖ్, విత్తనాల శేఖర్, రాయుడు కృష్ణమహేష్, పులిదిండి మంగాదేవి, రాయుడు చంటి తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ సెంటర్‌లో విజిలెన్స్ తనిఖీలు

కొత్తపేట: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఓ టిఫిన్ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 10 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి స్థానిక మండల సివిల్ సప్‌లెస్ అధికారి డీవీఎస్ రమాదేవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఏనుగుల మహల్ వద్ద సాయి టిఫిన్ సెంటర్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్‌లెస్, రెవెన్యూ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గృహ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనం కోసం వినియోగిస్తున్నారని అధికారులు గుర్తించారు. 10 సిలిండర్లను సీజ్ చేసి స్థానిక సివిల్ సప్‌లెస్ అధికారులకు అప్పగించారు. సంబంధిత హోటల్ యజమాని సలాది శివపై ఈసీ యాక్ట్ 1955 ప్రకారం 6 ఏ కేసు నమోదు చేసి, జేసీకి రిపోర్టు చేశారు. సీజ్ చేసిన సిలిండర్లను స్థానిక శ్రీనివాస హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీస్‌కు స్వాధీనం చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్, జియాలజిస్టు లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

అంబాజీపేట: దివ్యాంగులకు మనోధైర్యం కలిస్తూ వారి ఆర్థికాభివృద్ధి చెందేలా సీఎం జగన్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో శారీరక దివ్యాంగులకు నియోజకవర్గ స్థాయిలో మూడు చక్రాల స్కూటర్ల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ మూడు చక్రాల మోటార్ సైకిల్ లను పొందిన దివ్యాంగులు విద్యాభివృద్ధితో పాటు వ్యాపార అభివృద్ధిలో రాణించాలన్నారు. నియోజవర్గంలోని అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాలకు చెందిన పది మంది దివ్యాంగులకు రూ.9.20 లక్షల విలువైన మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ మేనేజర్ బి.రామ్‌కుమార్, పునరావాస అధికారి వై.శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చినబాబు, చింతపల్లి వెంకటేశ్వరరావు, దొమ్మేటి నాగన్న, మైలా ఆనందరావు, మట్టపర్తి యజ్ఞశ్రీ, నాగాబత్తుల శ్రీను, కడలి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో 'జగనన్న ఆణిముత్యాలు'



రాజోలులో ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో నాయకులు



కొత్తపేటలో ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు తదితరులు



పి.గన్నవరంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసించి ఉత్తమ మార్కులు సాధించిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులను సత్కరించారు. మండల పరిషత్ అధ్యక్షుడు కేతా శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంటర్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన జాస్మిన్, ప్రమీల, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన రేవతి, శ్రీఅక్ష, సాహితి, జీవనశ్రీలను అభినందించారు. రాజోలు పీఏసీఎస్ చైర్మన్ కూనపరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ బి.కృష్ణారావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు చింతా ప్రసాద్, పితాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించడమే 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం లక్ష్యమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలల నుంచి పదో తరగతిలో ఉత్తమ విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో సీఎం జగన్ విద్యావ్యవస్థలో విప్లవాత్మ మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విద్యార్థి చదువులో పోటీపడాలని ఉద్బోధించారు. ఆయా పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన నెల్లి జైశ్యామ్, దూలం ఎంఎస్‌పీ వినయ్, చోడపనీడి వీరబంగారం, సుతాపల్లి గీతిక, పి.లక్ష్మీ శ్రీవాసవి, ఆర్.శివనాగలక్ష్మిలను శాలువాలతో సత్కరించి, మెడల్స్, వరుసగా రూ.3 వేలు, 2 వేలు, వెయ్యి చొప్పున ఎంపీపీ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

యల్రాప్రగడ వారి రూ.25 వేల ప్రోత్సాహం

ఆయా పాఠశాలల నుంచి పదో తరగతిలో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులకు యల్రాప్రగడ సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు రాజశేఖర్, వెంకటరమణ ఏటా రూ.25 వేలు చొప్పున ఇచ్చే ప్రోత్సాహం కింద ఈ ఏడాది నెల్లి జైశ్యామ్, సుతాపల్లి గీతికలకు ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ చావలి సుబ్బరాయశాస్త్రి, పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, నగదు ప్రోత్సాహకుల తరఫున జేవీ సోమయాజులు, యల్రాప్రగడ వేణుగోపాల్, హెచ్ఎం క్రిస్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

పి.గన్నవరం: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ప్రభుత్వం నుంచి వచ్చిన నగదు బహుమతిని అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన సుంకర ఐశ్వర్యకు రూ.3 వేలు, ద్వితీయ సాధించిన కేతా జయశ్రీకి రూ.2 వేలు, తృతీయ స్థానాలు సాధించిన కొక్కిరి శిరి, సాధనాల ప్రణీత్ నాయుడికి రూ.వెయ్యి వంతున నగదు ప్రోత్సాహకాన్ని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు అందజేశారు. హెచ్ఎం, విద్యార్థులను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా..

మామిడికుదురు: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఉపాధ్యాయ సంఘం నేత భూపతి మనోహరరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, నాడు–నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దిన ఘనత ప్రభుత్వానికి దక్కిందని ఉపాధ్యాయ సంఘాల నేతలు చెప్పారు. ఉన్నత పాఠశాలల్లో తరగతుల విలీనం నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవడంతో పాటు పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దుతో సహా పలు సమస్యలను ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రస్తావించిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకు వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఏవీ శ్యామలావతి, కొమ్ముల వీరరాఘవరావు, పెయ్యల వీరభద్రరావు, టి.రాజారావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రామెళ్ల సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వర్షాల కోసం విరాటపర్వం పారాయణ

మామిడికుదురు: వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడి పంటలతో, ధన ధాన్యాలతో తులతూగాలని అభిలాషిస్తూ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో మహా భారతంలోని విరాటపర్వం పారాయణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేద పండితుడు జె.సోమయాజులు ఆధ్వర్యంలో ఆ పారాయణ జరిగింది. రాష్ట్రంలో ప్రస్తుతం మృగశిర కార్తె వచ్చినప్పటికీ వర్షాలు కురవక ప్రజలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. వాతావరణం అనుకూలించి వర్షాలు కురవాలని విరాటపర్వం పారాయణ చేశారు. ఆలయ ఈఓ జి.మాధవి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టీలు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

కొత్తపేట: మండలంలోని మోడేకుర్రులో గడపగడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి సోమవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల నిర్వహించిన గడపగడపకూ కార్యక్రమంలో సమస్యల పరిష్కారానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయి. వాటిలో గొలకోటివారిపాలెం, మోడేకుర్రు మెయిన్, రాకుర్తివారిపాలెం–సంజీవనగర్, తోట్లపాలెం ప్రాంతాల్లో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ రామలక్ష్మి కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అల్లం అన్నపూర్ణ, పార్టీ నాయకుడు కుడుపూడి వెంకటేశ్వరరావు, పలువురు పంచాయతీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

మహిళా పాడి రైతులతో సమీక్ష

ఆత్రేయపురం: మండలంలోని పేరవరం గ్రామ సచివాలయం వద్ద సోమవారం మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటు కోసం మహిళా పాడి రైతులతో సర్పంచ్ గంటి భారతి అధ్యక్షతన ఎంపీపీ కుండ అన్నపూర్ణ, ఎంపీడీవో నాతి బుజ్జి సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువలో భాగంగా పాల ఉత్పత్తి ఎక్కువగా ఉండే గ్రామాల్లో మహిళా డెయిరీ సహకార సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఏపుగంటి వీరరాఘవులు, వెటర్నరీ వైద్యులు డా.మౌనిక, ఏపీఎం అప్పలకొండ, కోఆపరేటివ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే ఫ్యామిలీ డాక్టర్

మామిడికుదురు: ప్రజలకు మెరుగైన వైద్యం అందించి వారికి అండగా ఉండాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్ పేర్కొన్నారు. పెదపట్నంలంకలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పి.నాగమణి, హెల్త్ అసిస్టెంట్ కేవీవీ సూర్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ పి.నాగదుర్గ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలుర హాస్టల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

ఆలమూరు: స్థానిక సమీకృత బాలుర వసతి గృహం (హాస్టల్)లో అర్హులైన విద్యార్థులను చేర్చుకునేందుకు అడ్మిషన్లు ప్రారంభించామని వార్డెన్ జీవీ రమణమూర్తి తెలిపారు. స్థానిక ఆవరణలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ హాస్టల్‌లో చేరేందుకు అన్ని కులాల వారు అర్హులన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఉచిత బస్ పాస్‌లు అందిస్తామన్నారు. విద్యార్థులందరికీ శిక్షణ బోధకులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎంపీటీసీ సభ్యురాలికి ఎమ్మెల్యే పరామర్శ

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం ఎంపీటీసీ సభ్యురాలు జలగం హేమలత భర్త వీర్రాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఎంపీటీసీ హేమలతను, ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే చిట్టిబాబు కలిసి ఓదార్చారు. వీర్రాజు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తొలుత వీర్రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు మేడిశెట్టి శ్రీనివాస్, మట్టపర్తి రామారావు, అంకం వీర్రాజు పరామర్శించిన వారిలో ఉన్నారు.